క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

కుక్కునూరు: కుక్కునూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శతాధిక వృద్ధుడు మృతి


మద్దిరాముడు(ఫైల్)

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెంకు చెందిన ఒక శతాధిక వృద్ధుడు ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. గ్రామానికి చెందిన వృద్ధుడు గంజి మద్దిరాముడు (102) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఈయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం కాగా, ముని మనుమలు, ముని మనుమరాళ్లు ఉన్నారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు మద్దిరాముడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రాయపరాజు సంతాప సభ


రాయపరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో మాజీ వార్డు సభ్యులు గొట్టుముక్కల రాయపరాజు సంతాప సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కోటగిరి శ్రీధర్ రాయపరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాయపరాజు భార్య, కుమారుడు వంశీరాజును పరామర్శించారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ ఎల్.వెంకటేశ్వరరావు, అనిల్ గౌడ్, గూడపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

దెందులూరు: అంకితభావం, ప్రణాళిక, సత్ఫలితాల సాధనదిశగా పని చేసేవారు ఎవరికైనా అవార్డులు ప్రోత్సాహాన్నిస్తా యని పండిట్ పరిషత్ రాష్ట్ర నాయకులు గిరిరాజు, పారిశ్రామికవేత్త నారా శేషు, దెందులూరు బాలికల పాఠశాల హెచ్ఎం పీ.శ్రీదేవి అన్నారు. ఆదివారం దెందులూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల సావిత్రిబాయిపూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జి జ్యోతిని గిరిరాజు, నారా శేషు సత్కరించారు.

చెకుముకి పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు పోటీల్లో విద్యార్థులు వీ రవికిరణ్, ఎం రాఘువేంద్ర, పీ రూపిణి ప్రథమ స్థానం సాధించారు. శిక్షణ అందించిన సైన్స్ ఉపాధ్యాయులు ఎం అమరావతి, ఏ విజయసారధిని ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తదితరులను విద్యార్థులను అభినందించారు.

పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

ఏలూరు (టూటౌన్): స్థానిక వసంత మహల్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు పార్కు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు అభ్యర్థన మేరకు ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నుంచి రూ.12 లక్షల నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్, గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల చైర్మన్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఏలూరు ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీరామ అక్షింతల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం ఏలూరు అమీనా పేటలో స్థానికులకు పంపిణీ చేశారు. అమీనా పేట శ్రీ రామాలయ భక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ 22వ తేదీ సాయంత్రం తమ ఇంటి ముందు 6 దీపాలు వెలిగించి స్వామివారి అక్షింతలు తలపై వేసుకుని శ్రీ హనుమత్ సమేత సీతారాముల కటాక్షం పొందాలని కోరారు. ఈ సందర్భంగా తురగా రామకృష్ణ, జాస్తి నాగేశ్వరరావు తదితర కుటుంబాలకు అక్షింతలు అందజేశారు.

మెట్టలో ముమ్మరంగా రబీ సాగు


మెట్టలో రబీ సాగుకోసం ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుకుంటున్న రైతులు


మెట్టలో రబీ నారుమళ్లు ఏపుగా ఎదిగిన దృశ్యం

సబ్ డివిజన్‌లో 8,204 ఎకరాల్లో రబీ సాగుకు సన్నాహాలు

చింతలపూడి: ఖరీఫ్ వ్యవసాయం ముగిసింది. మెట్ట రైతాంగమంతా ఇప్పుడు రబీ సాగులో ముమ్మరంగా నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరం తొలకరిలో వర్షాలు ఆశించిన విధంగా కురవడంతో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. కోతల సమయంలో వర్షాభావం ఏర్పడటంతో కొన్ని గ్రామాల్లో వరి పంటకు కావలసిన సాగు నీరు అందక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అనంతరం నవంబర్‌లో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మళ్లీ చెరువుల్లో నీళ్లు చేరాయి. వీటికి తోడు ఈ ఏడాది భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో రబీ పంట ద్వారా దిగుబడులు సాధించవచ్చునని రైతులు ఆశపడుతున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లో 8,204 ఎకరాల్లో రబీ వరి సాగు, 27,774 ఎకరాల్లో మొక్కజొన్న, 3,341 ఎకరాల్లో పొగాకు, 469 ఎకరాల్లో చెరకు, 200 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 689 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 151 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు మరింత ఉత్సాహంగా రబీకి సన్నద్ధమవుతున్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు

ఈ దశలో మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు తెలిపారు. కలుపు నివారణకు యట్రజిన్ మందును ఎకరానికి కేజీన్నర చొప్పున నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే చలికాలం కావడంతో వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదిస్తే జింక్ అందిస్తామని చెప్పారు.

ఆరుతడి పంటలు మేలు



భూగర్భ జలాలు ఈ ఏడాది పెరిగాయి. నీటిని ఆదా చేసుకుని మెట్టలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు. మార్చి నెల వచ్చేసరికి చెరువుల్లో నీళ్లు తగ్గిపోయి సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. తాగునీటితో పాటు, పశువులకు కూడా నీరు దొరక్క ఇబ్బందులు కలుగుతాయి. ఈ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల నష్టం ఉండదు. రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగతో పాటు అపరాల వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– బి.నాగకుమార్, వ్యవసాయ శాఖ చింతలపూడి సబ్ డివిజన్ ఏడీఏ

దోషులను కఠినంగా శిక్షించాలి

కామవరపుకోట: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ, కేసుల విజిలెన్స్ మోనిటరింగ్ సభ్యులు గుర్రాల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

ఏలూరు వెళ్లి పింఛన్ అందజేత


ఏలూరు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిట్టిబాబు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం పరిపూడి గ్రామానికి చెందిన పులపాకుల రాజారావు పింఛన్ లబ్ధిదారు. అనారోగ్య కారణాలతో ఆశ్రమం హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. అతడు పింఛన్ తీసుకోలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వలంటీర్ బొబ్బర చిట్టిబాబు హాస్పిటల్‌కి వెళ్లి పింఛన్ అందజేశాడు. ఈ సందర్భంగా వలంటీర్ల సేవా దృక్పథాన్ని పలువురు అభినందిస్తున్నారు.

జాగ్రత్తలే ‘శ్వాస’గా..


ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై మంచులో సంచరిస్తున్న భక్తులు


మంచులో శ్రీవారి కొండపైకి వెళుతున్న వాహనాలు

- రోజురోజుకు పెరుగుతున్న చలిగాలులు
- పొంచివున్న అనారోగ్య సమస్యలు

ద్వారకాతిరుమల: శీతాకాలం ముగింపు సమయం దగ్గర పడుతున్న కొద్ది చలిగాలులు ఎక్కువవుతున్నాయి. మంచు విపరీతంగా కురుస్తోంది. ఈ తరుణంలో ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. క్రమేపీ చలి మరింతగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆస్తమా, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. చలి ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్తే ఒక్కోసారి గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వీలైనంత వరకూ చలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు. పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

- మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి.
- దగ్గు, జలుబు, ఆయాసం వంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- ఎండ వచ్చిన తరువాత వాకింగ్ చేస్తే మంచిది.
- తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే చలి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- శ్వాస ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే చలికాలంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు వేడి ఆహారం తీసుకుంటే మంచిది.

పోస్ట్ కోవిడ్ రోగుల్లోనూ...

ఇంకా పోస్టు కోవిడ్ రోగుల్లో వేర్వేరు దుష్ఫలితాలు కనిపిస్తూనే ఉన్నాయి. కొందరిలో షుగర్ లెవల్స్ విపరీతంగా పెరుగుతున్నాయి. మరి కొందరిలో గుండె సమస్యలు తలెత్తుతున్నాయి. మరి కొందరు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా లంగ్ ఇన్వాల్వ్‌మెంట్ ఉన్న వారు చలికాలంలో అప్రమత్తంగా ఉండకపోతే శ్వాసకోశ ఇబ్బందులు

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే



చలికాలంలో శ్వాసకోశ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి ప్రాణాంతకంగా మారవచ్చు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జలుబు, దగ్గును నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఆస్తమా ఉన్న వారు చలిగాలులు తగలకుండా చూసుకోవాలి. చలితీవ్రత కారణంగా ఒక్కోసారి గుండెపోటుకు గురికావచ్చు. పోస్టు కోవిడ్ రోగుల్లోనూ చలికాలంలో ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వర్షాకాలంలో దోమకాటుతో డెంగీ, మలేరియా సోకినట్లు, చలికాలంలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతాయి. ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మంచిది.

– ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ద్వారకాతిరుమల

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


కుక్కునూరులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్, రావు వినోద్

కుక్కునూరు: నేటి యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని కుక్కునూరు సీఐ వి శ్రీనివాస్ కోరారు. కుక్కునూరు చర్చ్ హాస్టల్ నందు మండల రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహిస్తున్న 8వ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు రావు వినోద్, సీఐ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత జూద క్రీడల వైపు వెళ్లకుండా ఇటువంటి క్రీడలు దోహదపడతాయన్నారు. ఇటువంటి క్రీడలు నిర్వహించేందుకు సహకారాన్ని అందిస్తున్న మండవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్యాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యర్నం సాయికిరణ్, సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, వైఎస్సార్‌సీపీ యూత్ సూర్ల రాము, మల్లెల చంటినాయుడు, మన్యం సాయి, షేక్ సుకూర్, రిషిమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన డ్రైయినేజీ కల్వర్టు


కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో కూలిన డ్రైయినేజీ కల్వర్టు

కొయ్యలగూడెం: ఇటీవల నిర్మించిన డ్రెయినేజీ కల్వర్టు కూలిపోవడంపై బయ్యనగూడెం గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి–తల్లాడ జాతీయ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా (516 డి) బయ్యనగూడెంలో ఇరువైపులా 500 మీటర్ల చొప్పున డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలోనే నాణ్యత లేనివిధంగా కల్వర్టు డ్రెయినేజీ నిర్మాణం సాగుతోందని గతేడాది ఆగస్టులో మండల పరిషత్, పంచాయతీ ప్రజాప్రతినిధులు ఆందోళన సైతం నిర్వహించారు. కానీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో శనివారం డ్రెయినేజీ కల్వర్టు కూలిపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. నత్త నడకన జరుగుతున్న నిర్మాణ పనులకు తోడు నాణ్యతలేని విధంగా డ్రెయినేజీ, కల్వర్టులు నిర్మించారని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జరుగుతున్న పనులను అడ్డుకుంటామని ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, పీఏసీఎస్ అధ్యక్షుడు బాపిరాజు పేర్కొన్నారు.

పేదలకు భూపంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్

టి.నరసాపురం: కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలు చేయడంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. టి.నరసాపురం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సర్వే నెంబరు 668లో గల 5773.11 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూమిని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం టి.నరసాపురం మండలం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాడిగడప జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు జరిగితేనే పేదలకు ఇంటి స్థలం, సాగు భూములు దక్కుతాయని అన్నారు. పేదలు ఆత్మ గౌరవంతో బతకాలంటే భూపంపిణీ జరగాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేసి, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, 200రోజులు పని దినాలు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు గొలిమె బాలయేసు, సీపీఐ చింతలపూడి మండల కార్యదర్శి కంచర్ల గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీని తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): మందులపై జీఎస్టీని తగ్గించాలని, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లకు కార్మిక చట్టాలు అమలు చేసి, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ యూవీ కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక పవర్ పేటలోని సీఐటీయూ కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన యూనియన్ వార్షిక మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీఎస్టీ పేరుతో అన్ని రకాల వస్తువులపై విపరీతంగా పన్నులను పెంచిందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణావసరమైన మందులపై కూడా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించటం దారుణమని అన్నారు. జీఎస్టీ నుంచి ప్రజల అత్యవసర, నిత్యావసర మందులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఫార్మా సంస్థలు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. ఫార్మా రంగంలో పనిచేస్తున్న సేల్స్ రిప్రజెంటేటివ్‌లకు కార్మిక చట్టాలు వర్తింపజేయాలని అన్నారు. కనీస వేతనాలు అమలు చేసేలా ఫార్మా కంపెనీలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పి.కిషోర్ మాట్లాడారు. యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా మొహిద్దీన్, కోశాధికారిగా వై.దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పి.కిరణ్ కుమార్, పి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా సీతయ్య, ఉమా మహేష్, కమిటీ సభ్యులుగా చెన్న కేశవ, సీహెచ్ కార్తీక్, కె.శివలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.

10 నుంచి సంక్రాంతి సంబరాలు


వివరాలు వెల్లడిస్తున్న పి.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: నేటి తరం యువతకు మన సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను తెలియజేసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జె.ఆర్.జి. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ (సిటీ కేబుల్) ఎండీ పాలపర్తి శ్రీనివాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్ లో ఉన్న రాజాన రాములమ్మ చెలక వద్ద ఈ నెల 10వ తేదీన తపన ఫౌండేషన్ సహకారంతో జె.ఆర్.జి. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాజాన రాములమ్మ చెలక వద్ద ఆదివారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. ఈ సంబరాల్లో ముగ్గుల పోటీలతో పాటుగా భోగి మంటలు, గొబ్బెమ్మలు, కోలాటం, క్లాసికల్ డాన్సులు, గంగిరెద్దుల ఆటలు ఏర్పాటు చేస్తామన్నారు. డాగ్ షో కూడా ఉంటుందన్నారు. వీటితో పాటుగా సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ కూడా ఈ సంబరాల్లో సందడి చేయనున్నట్లు వెల్లడించారు.

కృత్రిమ కాళ్ల పంపిణీకి ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కృత్రిమ కాళ్ల పంపిణీ నిమిత్తం ఎంపిక శిబిరం నిర్వహించారు. పుట్టుకతో అంగవైకల్యం, ప్రమాదాల వలన కాళ్లు పోవడం, మధుమేహ వ్యాధి తీవ్రతతో కాళ్లు తొలగించిన వారికి నడవడానికి తోడ్పడే ఆర్టిఫిషియల్ లెగ్స్ (కృత్రిమ కాళ్లు) ఉచితంగా పంపిణీ చేయడానికి క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, సెక్రటరీ బొల్లా వీవీ సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య, ప్రవాసాంధ్రులు డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ హిమబిందు (యూఎస్ఏ) ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ పూర్వపు గవర్నర్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, వైస్ గవర్నర్లు కాకరాల వేణుబాబు, పాపారావు నాయుడు, పూర్వపు గవర్నర్ మేకా శ్రీరామ్ సురేష్, కేవీ కిషోర్ కుమార్, రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జునరావు, జోన్ చైర్మన్ కుర్మా శ్రీనివాస్ పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 150 మంది వికలాంగులకు స్క్రీనింగ్ నిర్వహించి 90 మందిని ఎంపిక చేశారు. వారందరికీ కొద్ది రోజుల్లోనే కృత్రిమ అవయవాలు అందిస్తామని క్లబ్ అధ్యక్షుడు తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

జంగారెడ్డిగూడెం: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని లిడ్ క్యాప్ డైరెక్టర్, చింతలపూడి నియోజకవర్గ నేత సొంగా సందీప్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, ఉన్నత లక్ష్యాల వైపు తీర్చిదిద్దేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రూపొందించారని తెలిపారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా వలంటీర్లను పెట్టి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన మహానేత జగన్ అని పేర్కొన్నారు. నేడు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

భద్రాద్రి రామయ్య కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం


మద్ది క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏప్రిల్ 17న భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి క్షేత్రంలో జరిగే రామయ్య కల్యాణానికి ఆదివారం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో తలంబ్రాలను సిద్ధం చేశారు. భక్తులు ధాన్యం గింజలను గోటితో వలిచి తలంబ్రాలను సిద్ధం చేశారు. శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి రమాదేవి, మద్ది ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టెన్నపాలెంలో సంక్రాంతి సంబరాలు


విద్యార్థినులు వేసిన ముగ్గులను వీక్షిస్తున్న సర్పంచ్ రత్నకుమారి

జంగారెడ్డిగూడెం రూరల్: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి అన్నారు. మండలంలోని పట్టెన్నపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు వీక్షించారు. సర్పంచ్ రత్నకుమారి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు.

నాగేంద్రబాబుకు ఎంపీ పరామర్శ


నాగేంద్రబాబుని పరామర్శించిన ఎంపీ శ్రీధర్‌బాబు

జంగారెడ్డిగూడెం రూరల్: అక్కంపేటలో సర్పంచ్ పారేపల్లి నాగేంద్రబాబుని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఇటీవల నాగేంద్రబాబు పెదనాన్న సత్యనారాయణ మృతి చెందారు. ఎంపీ శ్రీధర్‌బాబు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఎంపీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మేడవరపు విద్యాసాగర్, రాఘవరాజు ఆదివిష్ణు, వార్డు కౌన్సిలర్ అంజి, ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, నేట్రు గణేష్, చిప్పాడ వెంకన్న పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకుని వాపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని కొక్కిరపాడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థావరంపై దాడి చేసి 12 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.